క్లుప్తంగా

ఎమ్మెల్యే నానిని కలిసిన బిషప్



ఎమ్మెల్యే నానితో చర్చిస్తున్న బిషప్ పొలిమేర జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ఆదివారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. త్వరలో రోమన్ కథోలిక సంస్థ భారతదేశ గౌరవ అంబాసిడర్ ఏలూరులో పర్యటించనున్న నేపథ్యంలో బిషప్ జయరావు నానితో పలు విషయాలు చర్చించారు. దీనిపై నాని స్పందిస్తూ రోమన్ కథోలిక సంస్థ అంబాసిడర్ పర్యటనకు సంబంధించి తన సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తానని బిషప్ జయరావుకు హామీ ఇచ్చారు. ఫాదర్‌లు జి.మోజెస్, బాల, మైఖేల్ ఇంజమాల తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో సీపీఎం ప్రచార క్యాంపెయిన్



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని, బీజేపీ విధానాలపై మార్చిలో ప్రచార క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం పిల్లి రామకృష్ణ అధ్యక్షతన పార్టీ మండల, పట్టణ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందుతుందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దెందులూరు: గ్రామానికి చెందిన మోటారు మెకానిక్ రమేష్ ఆదివారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడని దెందులూరు ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. రమేష్ (27) దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం రమేష్ పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రమేష్ మృతి చెందాడని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

- రూ.45 కోట్లతో విద్యుత్ పనులు
- రూ.12 కోట్లతో 3 సబ్ స్టేషన్ల ఏర్పాటు

ఏలూరు రూరల్: ప్రభుత్వం ఏలూరు నియోజకవర్గంలో జగనన్నకాలనీల్లో విద్యుత్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వందలాది విద్యుత్ స్తంభాలు పాతారు. ప్రతి ఇంటికీ మీటర్, ప్రతి వీదిలో కరెంట్ లైన్, ప్రతి కాలనీకు ఒక సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా మూడు కాలనీలు కలిపి 93 కిలోమీటర్ల దూరం ఉన్న కరెంట్ లైన్ సిబ్బంది లాగుతున్నారు. ఇందుకోసం అధికారులు పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారు. నిరుపేదలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం 45 కోట్ల రూపాయలు కేటాయించిన విషయం విధితమే. కొమడవోలు, పోణంగి, లక్ష్మీపురం ఒక్కొక్క కాలనీకు రూ 15 కోట్లు చొప్పున నిధులు ఖర్చు చేస్తోంది.

మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణం

కాలనీల్లో నివసించే పేదలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సబ్ స్టేషన్లు ఏర్పాటు పనులు సైతం కొనసాగుతున్నాయి. ఒక్కొక్క సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.4 కోట్లు మంజూరు చేసింది. మొత్తంగా 12 కోట్ల రూపాయలతో అధికారులు సబ్‌స్టేషన్లు ఏర్పాటు కావడంపై కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొమడవోలు కాలనీలో విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న దృశ్యం



లక్ష్మీపురంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం స్తంభాలు పాతుతున్న సిబ్బంది



పోణంగి కాలనీలో విద్యుత్ వైర్లు అమర్చుతున్న సిబ్బంది



పోణంగిలో విద్యుత్ లైన్లు లాగుతున్న దృశ్యం

క్షతగాత్రుడిని ఆదుకున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మానవత్వం చాటుకున్నారు. గన్నవరం కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఎదురుగా ఒక వ్యక్తి బైక్‌పై నుంచి ఆదివారం ఏలూరు నుంచి విజయవాడ వెళుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. విజయవాడ వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వెంటనే కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని పరామర్శించి సపర్యలు చేశారు. అంబులెన్స్‌కు సమాచారం అందించి, అది వచ్చే వరకూ అక్కడే ఉండి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరం

దెందులూరు: మొర్ల నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం నాగులదేవునిపాడులో నాగరాజు సంతాప సభలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బోయపాటి గణేష్, వార్డు సభ్యులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధం హర్షణీయం



మాట్లాడుతున్న రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్

నిడమర్రు: రాష్ట్రంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తూ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మానవత సేవా సంస్థ రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆదివారం మండల మానవత సంస్థ సమీక్ష సమావేశం మందలపర్రులోని సరిపల్లి కుమారి నివాసం వద్ద జరిగింది. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లా డుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఎవరికి వారే స్పందించి ప్లాస్టిక్ కవర్లు వాడకం మానుకోవాలని కోరారు. ఈ విషయంలో మానవత సంస్థ నుంచి పూర్తి మద్దతు, సహకారం ఉంటుందన్నారు. అనంతరం సంస్థ ప్రగతి, సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, మండల కార్యదర్శి నౌడు అచుత్య రామారావు, దెందుకూరి త్రిమూర్తిరాజు, ఇంటి చంటి, ఎంసీహెచ్ అప్పారావు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, బత్రాజు ప్రసాద్, ఎస్, దావీదు పాల్గొన్నారు.

గుప్తా ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం



మోక్షరథం, ముక్తి రథాలను ప్రజలకు అంకితం చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



సుబ్బమ్మదేవి పాఠశాల వజ్రోత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆళ్ల నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ సేవలు అందరికీ ఆదర్శనీయమని మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు ప్రజలకు ఉచిత సేవలు అందించడం కోసం గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన 'మోక్ష రథం , ముక్తి రథం' (అంతిమ యాత్ర ఉచిత సేవా వాహనాలు)ని నాని క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గుప్తా ఫౌండేషన్ తరపున మడుపల్లి మోహన గుప్తా కుటుంబ సభ్యులు నాని చేతుల మీదుగా నగర ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వ్యాపార రంగంలో తనకంటూ ఎంతో గుర్తింపు సాధించడంతో పాటు ప్రజలకు సేవలు అందించాలనే ఒక గొప్ప ఆశయంతో ఏలూరు నగరంలో గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అన్నారు. అంతిమ యాత్రకు ఉపకరించేలా రూ.22 లక్షల రూపాయలుతో మోక్ష రథం, ముక్తి రథం అనే 2 అంతిమ యాత్ర వాహనాలను ఏర్పాటు చేసి, వాటి సేవలు ప్రజలకు ఉచితంగా అందించేలా ఆ వాహనాలను ఏలూరు నగర పాలక సంస్థకు అందచేయటం ఎంతో అభినందనీయం అన్నారు. అంతిమ యాత్ర ఉచితవాహన సేవలు పొందటానికి ఏలూరు కార్పొరేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004254287, ల్యాండ్ నెంబర్ 08812-232101 ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మడుపల్లి మోహన్ గుప్తా సతీమణి మడుపల్లి.ఈశ్వరీ గుప్తా, కుమారుడు విజయ్ కుమార్ గుప్తా తో పాటు వారి కుటుంబ సభ్యులు, గుప్తా ఫౌండేషన్ సభ్యులను నాని అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు ఘంటా ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జక్కుల బెనర్జీ, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, వైసీపీ నాయకులు మోటామర్రి సదానంద్, కొల్లిపాక సురేష్, కిలాడి దుర్గారావు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి సహకరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవశకం వైపు నడిపిస్తున్నారని, దానికి ప్రతీ ఒక్కరూ సహకారం అందిస్తే రాష్ట్ర విద్యారంగం ప్రపంచంలోనే ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు. నగరంలోని ఈదర సుబ్బమదేవి నగరపాలక ఉన్నత పాఠశాల 75 సంవత్సరాల వజ్రోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థి స్థాయిలో ప్రతీ ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు కఠోర సాధన చేయాలని సూచించారు. నగరంలోని ఈదర సుబ్బమ దేవి పాఠశాల దేశానికి, ప్రపంచానికి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను, పారిశ్రామికవేత్తలను అందించడం, ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విదేశాల్లో సైతం పరిశ్రమలు ఏర్పాటు చేసి అక్కడి వారికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించడం అసాధారణ విషయమన్నారు.అనంతరం నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ సుబ్బమ్మదేవి స్కూల్ అభివృద్ధికి నగరపాలక సంస్థ తరఫున మరింత కృషి చేస్తామన్నారు. విదేశాల్లో స్థిరపడిని పూర్వ విద్యార్థులు సైతం తమ పండుగగా భావించి వజ్రోత్సవాలకు హాజరు కావడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఎంపీ కోటగిరి శ్రీధర్, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్, పాఠశాల పూర్వ విద్యార్థులైన భారతీయ రిజర్వ్ బ్యాంక్ రిటైర్డ్ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, ప్రస్తుత ఐపీఎస్ అధికారి రెడ్డి గంగాధరరావు, హెచ్ఎం కుటుంబరావు, వి.రత్నకుమార్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మి మృతి విచారకరం



కె.విశ్వనాథ్, ఆయన సతీమణి జయలక్ష్మితో స్త్రీ వేషధారణలో కేవీ సత్యనారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివంగత దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి మృతి విచారకరమని నగరానికి చెందిన సినీ నృత్య దర్శకుడు కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు సినిమాల్లో నృత్య దర్శకునిగా అవకాశం కల్పించి తన ఎదుగుదలకు కారణమైన కె.విశ్వనాథ్ ఈనెల 3న మరణించడాన్ని జీర్ణించుకోలేకపోతున్న తరుణంలో తనకు మాతృ సమానురాలైన ఆయన సతీమణి జయలక్ష్మి మరణ వార్త కూడా ఈ నెలలోనే వినాల్సి రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆ దంపతులిరువురూ ఏలూరు వచ్చినప్పుడు తన నివాసంలోనే బస చేసి కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారని తెలిపారు. వారి మృతిపై సంతాపం తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	12-15
బెండకాయలు	44	కంద	46
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	30
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	56
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	24	పాలకూర	08
దొండకాయలు	24-28	చుక్కకూర	08
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	18	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	44	బఠాణీ	48
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ సీతారామ స్వామి



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం భారీ నారాయణ సేవ (అన్న సమారాధన) కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తరపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం నిర్వహించిన నారాయణ సేవలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య బృందం ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఘనంగా పెద్దింట్లమ్మ తల్లి వార్షికోత్సవం



రత్నాపురంలో పూజలందుకుంటున్న పెద్దింట్లమ్మ తల్లి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: కొల్లేరు వాసుల ఆరాధ్య దైవం పెద్దింట్లమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరికీ అందాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. కోరుకల్లు పంచాయతీ శివారు రత్నాపురంలోని పెద్దింట్లమ్మవారి 3వ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. కొల్లేరు వాసుల కొంగు బంగారమైన పెద్దింట్లమ్మ తల్లి ఈ ప్రాంత ప్రజలపై కరుణా కటాక్షాలు చూపుతోందన్నారు. కొల్లేరులోని ప్రతి గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించే సంప్రదాయం కొనసాగించడం శుభపరిణామమన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కమిటీ నిర్వాహకులను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాగు సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ టి.రామలింగరాజు, గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేమలమంద రామరాజు, పెద్దలు దాట్ల సుబ్బరాజు, నంద్యాల సుబ్బరాజు, పిప్పర సుబ్బరాజు, వేగేశ్న వెంకట రామరాజు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పాస్టర్ స్పర్జన్ మృతికి సంతాపం



పల్లిపాము స్పర్జన్

ఏలూరు (టూటౌన్): స్థానిక సత్రంపాడులోని విన్ అవర్ నెగిటివ్స్, గెత్సమెన్ ప్రార్థన సహవాసం వ్యవస్థాపకుడు పాస్టర్ పి.జీవన్ కుమార్ తండ్రి పల్లిపాము స్పర్జన్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేసారు. పాస్టర్ స్పర్జన్ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ క్రీస్తు బోధనలకు ఆకర్షితుడై ఉద్యోగం వదిలి సేవకు అంకితమైన గొప్ప వ్యక్తి అంటూ కొనియాడారు. ఆదివారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు. ఆయన కుమారుడు పాస్టర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిపి.జీవన్ కుమార్‌కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్పర్జన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఆర్‌సీఎం బిషప్ పొలిమేర జయరాజు, దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు, నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు తదితరులు ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

భీమడోలు: మానసిక ప్రశాంతత ధ్యానం వల్లే సాధ్యమని ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని భవానమ్మ ఆలయంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు మాట్లాడుతూ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మంచి ఆరోగ్యం, ఉత్తమైన జీవన విధానం ధ్యానం వల్ల సాధ్యమని అన్నారు. ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం మాజేటి శేషగిరిరావు దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, డీబీసీసీ మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు, భవానమ్మ కమిటి పెద్దలు పాశం రామాంజనేయులు, మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.